# పెద్ద పులులు

(క థా ని క)

ఆ రోజులు నా జీవితంలో ఎన్నడూ మరపురావు. మసకచీకట్ల వెనుక మెరిసే వెలుగు రేఖల్లాగ ఇంకా అవి నాకళ్ళకి కనబడుతూనే వుంటాయి. నేనప్పుడు ధైర్యంలేని బలహీనుణ్ణి. లోకంముందు గొప్పవాడినే కాని నాలో నేను పిరికివాడిని. అవి చిప్లూన్ మహారణ్యాలలో పడమటి కనుమలమీద క్యాంపుచేసిన రోజులు. నాకోసమే కట్టివుంచినట్లు కొండమీద వున్న వంటరి బంగాళాలో విడిసి వున్నాను. నేనూ, నాతో పనిచేసే పదిమంది నిర్భాగ్యులూ, బంగాళా చౌకిదారు సకారామూ తప్ప ఆ ప్రాంతంలో మానవ సంచారమే వున్నట్లు లేదు. పోగా బంగాళాకి కొద్ది దూరంలో రెండు పాడుకొంపలున్నాయి. అలాంటి విజన ప్రదేశంలో సకారామ్ ఎలా వుంటున్నాడో తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ బంగాళాని కనిపెట్టుకునే అతడు జీవితంలో వసంతంనుంచి శిశిరం దాకా గడిపేశాడు. చేతిలో పడే పదిహేను రూకలే అతనికి పదిహేను వేలు. ఏది యేమైనా సకారామ్ సంతృప్తిపరుడు.

కొండలు చూసినకొద్దీ నాకు పిచ్చి ఎత్తుతూంది. ఈ అరణ్యాలలో పెద్దపులు లున్నాయని సకారామ్ చెప్పగానే భయం కూడా కలుగుతూంది. "ఎప్పుడు పోయి మానవ సమాజంలో పడుదునా, ఎప్పుడు చక్కని ముఖాలు చూసి సంతృప్తి పడుదునా" అని తపన పడుతున్నాను. ఏవేవో తలచరాని తలపులు, కోరరాని కోర్కెలు నన్నావేశించేయి. ఎలావున్నా రోజులు గడపక తప్పదు. బంగాళాలో దిగిన మూడోరోజు ఉదయం కొంచెం ఆలస్యంగా లేచేను. చలి అధికంగా వుంది. తలుపు తెరచే సరికి దూరాన పాడుకొంపలో ఎవరో కదలుతూన్నట్లయింది. తేరిపార చూసేను. ఒక స్త్రీమూర్తి నా కంటబడి లోనికి వెళ్ళిపోయింది. నాకూ కొంత ధైర్యమూ ఆ ప్రదేశంమీద కొంత ఇష్టమూ కలిగేయి. ఆమర్నాడాదివారం. పనికి పోలేదు. రోజంతా కళ్లు పెద్దవి చేసుకు కూర్చున్నాను. ఆ పాడుకొంపలో మానవ సంచారమే కాదు— దేవకన్య లాంటి సౌందర్యవతి నివసిస్తోందని తెలిసింది. చీకటి పడింది. ఆవైపే చూస్తున్నాను. చిన్న దీపం మసక మసకగా వెలుగుతూంది. ఆ చిరుకాంతిలో నీలిరంగు చీరమాత్రం మెరుస్తూంది. వరండాలో నిలబడి ఆ సుందరి ఎవరి రాకనో ఎదురుచూస్తున్నట్లుంది. ఆ అదృష్టవంతుడెవరో చూద్దామని దొంగవాటుగా నేనూ పొంచివున్నాను. మధ్య మధ్య ఆ యువతి పాడిదగ్గు, గాజుల చప్పుడూ మాత్రం వినిపిస్తున్నాయి. అకస్మాత్తుగా పది గంటలకు దీపం కనబడలేదు. నామటుకు నేనూ వచ్చి పడుకున్నాను. కొండలలో అరణ్యాలలో పనిచేస్తూ నేననుభవించే కష్టంకంటె ఆనాడు నా ప్రక్కమీద ఒత్తిగిల్లడం ఎక్కువ బాధగా తోచింది.

మరునాటినుంచీ ఆవేపు చూడకుండా వుండలేకపోయాను. నాజీవితంలో నేనెప్పుడూ అంత అందకత్తెను చూడలేదు. అయినా బాగుండదని చాటుచాటునే చూస్తున్నాను. అయిదురోజులు గడిచేయి. సాయంత్రం ఏడు గంటలకి నా గదిలో భోజనం చేస్తున్నాను. ఒక కుర్రాడు, ఎనిమిదేళ్ళవాడు సరాసరి నావద్దకు వచ్చి "మా అక్క మిమ్మల్ని పిలుస్తోంది" అన్నాడు. నా చేతిలో అన్నంముద్ద ప్లేటులో పడిపోయింది. వడ్డిస్తూన్న వంటవాణ్ణి ఏదో సాకుచెప్పి బయటకు పంపించేసేను. ఆ అర్భకుని దగ్గరగా పిలిచి "ఏమిటి" అన్నాను మెల్లిగా.

"మాఅక్క మిమ్మల్ని రమ్మంది" అన్నాడు నిర్భయంగా.

జయంతి శ్రీరామమూర్తి

నా నవనాడులూ క్రుంగిపోయాయి. వా డెవరు? అక్క యెవరు? నన్నెందుకు రమ్మంది? వెళ్ళాలని ప్రాణం పీకులాడుతోంది. ఆమె సౌందర్యాన్ని దగ్గరనుంచి చూడాలని కళ్లు తహతహలాడుతున్నాయి. మనస్సు బిగించి వుంచిన పట్టులోంచి ఇంద్రియాలు ఒక్కటొక్కటే జారి పోతున్నాయి. ఏలాగో మళ్లా "మీ బావ ఏంచేస్తున్నాడు" అన్నాను

"లేడు చచ్చిపోయాడు" అన్నాడు. నాకెందుకో కొంత శాంతి లభించినట్లయింది.

"మీ అక్క పేరేమిటి?"

"సుందరీబాయ్" - నిజంగా ఆమె సుందరి. స్వర్ణసుందరి.

"అయితే చెప్పు- ఈ వేళ రాను" అన్నాను. వాడునాకంటే గట్టివాడు

"మరి రేపు వస్తారా?" అన్నాడు

"రేపూ రాను. వస్తే మీ అక్కనే ఇక్కడికి రమ్మను రేపు" అన్నా నెల్లాగో తడబడుతూ. అర్భకుడు వెళ్ళి పోయేడు. రాత్రి తొమ్మిదింటికే మసక దీపం మాయమయిపోయింది. సుందరీబాయ్ నిద్రపోయి వుంటుంది. నాకు నిద్రరాక బయట పచారు చేస్తున్నాను. అది ఎత్తైన ప్రదేశం. అక్కడనుంచి తూర్పుగా అగాథమైన లోయ. పడమటి దిక్కునా అగాథమైనలోయ - దానినే "ఘాట్ మాథా" అంటారు. చంద్రుడప్పుడే వుదయిస్తున్నాడు. తూర్పున వున్న లోయ ప్రకాశిస్తూంది. పడమటిలోయని కొండనీడ ఆవరించింది. దూరాన వెదురు పొదల్లోంచి గాలి రివ్వుమంటూ శబ్దం చేస్తూంది. పికిలి పిట్ట కూసికూసి పడుకుంది. కీచురాళ్లు గోడచేస్తున్నాయి. నాలో కురుక్షేత్రసంగ్రామ మారంభమయింది.

తూర్పువైపు లోయకేసి చూస్తున్నాను. ప్రభావతి నా భార్య. అగ్నిసాక్షిగా కట్టబెట్టబడినయిల్లాలు. అయిదు వేల నగదుతో, నాలుగెకరాల భూమితో, వెండిసామగ్రితో, చీని చీనాంబరాలతో, సారె బిందెలతో యథాలాంఛనంగా మాయింట కాలు పెట్టిన కోడలు. పొంగుకు వస్తున్న కాలవాహినికి ఎదురీదలేక పోయినాను. అరచి అరచి నాగొంతు మూగవోయింది. ఆమెను కట్టుకోకపోతే ఐదువేల రూకలూ వచ్చిపడవు. అవి లేనినాడు నాకు చదువెక్కడిది? ఉద్యోగమెక్కడిది? ఈనాడు లోకం నన్ను గౌరవిస్తోంది-నా ఉద్యోగంచూసి. ఇదంతా ప్రభావతి ప్రభావం కాదూ? ఇక ఆమెఅందచందాలా?

"సంసారికి అందమేమిటిరా" అంది మా అమ్మ ఆనాడే—

"ఆపిల్లకేంలోటు, కాలు వంకరా, చెయ్యి వంకరా" అన్నారు నాన్న.

"అందమేం కొరుక్కుతినే వస్తువా" అంది మా ముసలమ్మ.

ఒకరి మాటెందుకు? సౌందర్యానికీ సువర్ణానికీ జరిగిన పోటీలో నేనే సువర్ణపక్షపాతి నయ్యేను.

పడమటిలోయ తిలకిస్తున్నాను. సుందరీబాయి అపురూప సౌందర్యవతి. విగత భర్తృక. ఎడారి కుసుమంగా, ఆకలి దప్పులమధ్య మినుకు మినుకనే దీప కళికలావుంది. ఆమెను చేరదీసి ఉద్ధరించడం దోషమా? ఆమె సౌందర్యాన్ని చేత బట్టుకుని నన్ను ఆహ్వానిస్తూన్నట్లుంది. సౌందర్యవతి అయిన స్త్రీ తన యవ్వనంతో లోకాన్ని జయించి, ధనరాసులు మూటకట్టుకోగలదు. దీనికి చరిత్రలో ఎన్నో నిదర్శనాలున్నాయి. ఇంకా అవి జరుగుతూనే వున్నాయి. ఈనాడు సుందరి నన్ను రమ్మంటోంది. ఎందుకో? బహుశా అందుకే కాబోలు! ఇంతలో ఎవరో నా వెనక నిలబడ్డారు. ఉలిక్కిపడి చూసేను. సకారామ్—

"బాబూ! ఒంటరిగా బయట వుండకండి. ఈ ప్రాంతంలో పెద్ద పులులున్నాయి" అన్నాడు. లోనికి వెళ్ళి పడుకున్నాను.

మర్నాడు రాత్రి తొమ్మిది గంటలకు పడకకుర్చీలో పడుకుని పుస్తకం చదువుతున్నాను. బయట యెవరో నడచిన చప్పుడైంది. తల యెత్తి చూసేలోగానే సుందరి నా గదిలో అడుగుపెట్టింది. ఆమెతోబాటు ఏవో కాంతి రేఖలూ లోన ప్రవేశించేయి. వెంటనే లేచి తలుపు బిగించేను. కిటికీలు మూసేసేను. సుందరీబాయి సరాసరివచ్చి నామంచంమీద కూర్చుంది. చిరునవ్వుతో సిగ్గుపడుతూ నన్ను చూస్తూంది. నాకూ ఎందుకో మాటరాలేదు, అలాంటి అను

భూతి యెన్నడూ నేననుభవించలేదు. నా పాతికేళ్ళ జీవితచరిత్రలో అలాంటి క్షణం ఎన్నడూ నేను గడపలేదు

"ఏం అలా భయపడతారు?" అంది సుందరి.

"భయమా? నాకెందుకు భయం?"

"మరెందుకంత దూరంగా కూర్చుంటారు?"

ఏంమాట్లాడాలో నాకు తెలియలేదు. ఏం చెయ్యాలో అంతకన్న తెలియదు. తలయెత్తి ఆమెముఖం చూశాను. తీర్చిదిద్దిన రూపసంపద, కళాసౌష్ఠవం ఉట్టిపడే ముక్కుతీరు, కన్నుల సొరు- నన్ను మభ్యపుచ్చుతున్నాయి.

"మీరెవరు?" అన్నా నెల్లాగో.

"నేనా? నేనొక అడదాన్ని" అంది సుందరి చమత్కారంగా.

"అదికాదు. మీ సంసారం గురించి అడుగుతున్నాను. ఆయింట్లో ఎవరెవరున్నారు?"

"నేనూ, మా అన్నయ్యా, మా తమ్ముడూ వున్నాం" అంది సుందరి.

"నువ్విలా రావడం మీ అన్నకు తెలిస్తే."

"ఏమీ చెయ్యడు- వాడికీ తెలుసు చావు బ్రతుకులతోటి చెలగాటం" అంది సుందరి. ఆ మాట నాకు సరిగా అర్థమవలేదు. బహుశా తన పేదస్థితిని గూర్చి పలుకుతూంది కాబోలు! ఇంతలోనే సుందరి మళ్ళీ-

"అంత భయపడతారెందుకు రోజూ నన్నంతగా తొంగి తొంగి చూసేవారు"అంది. నిజమే, నాకూ తెలియదు. తొంగి తొంగి చూసినమాట నిజం. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, ఆఖరికి రాత్రి ఆ మినుకుదీపం ఆరిపోయేవరకూ తొంగి చూసేవాడిని.

"అబద్ధం, నిన్నే చూసేనని వుందా? ఆపైన చూసినా నిన్నిలాగ రమ్మన్నానా?" అన్నాను ధైర్యం తెచ్చుకొని—

"మరి మా తమ్ముడుతో ఏం చెప్పారు నిన్న" అంది సూటిగా చూస్తూ. నానోట మాట రాలేదు.

"మాటలు కట్టిపెట్టి యిక లెండి" అంది సుందరి నా భుజంమీద చెయ్యి వేస్తూ. నేను కూర్చున్న కుర్చీ గిరగిరా తిరుగుతూంది. ఏంచెయ్యాలో నాకు తోచలేదు. ఆలోచించే నిలకడలేదు. ఇంతలో సుందరి దీపం తగ్గించేసింది. ఆమె మృణాళ బాహువులు ఒక్క వూపుతో నన్ను కుర్చీమీదనుంచి మంచంమీదకు లాగివేసేయి.

* * *

నాకు సుందరీబాయ్‌లో రోజురోజూ క్రొత్త అందాలు కనబడుతున్నాయి. ఆమె నామీద అపారమైన ఆపేక్ష చూపుతూంది. స్వర్గానికి సోపానాలు నిర్మించి నన్ను అమృతరస వీధుల్లోకి తీసుకు పోతూంది. అయిదు సంవత్సరాల వైవాహిక జీవితంలో ప్రభావతి ఇచ్చిన ఆనందం,సుందరీబాయ్ అయిదురోజుల్లో యిచ్చేసింది. రోజంతా పని చేసి అలసివచ్చినా, ఆమె కోమల హస్తాంగుళుల స్పర్శ నాలో నూతనోత్సాహాన్ని పుట్టిస్తుంది. ఆమె నాకు చాటుచాటున తినుబండారాలు పంపిస్తుంది. ఆమెకు బదులు నేనేమీ ఇవ్వలేకపోతున్నానని కించపొందుతున్నాను. అప్పుడప్పుడిచ్చే రూపాయలనోట్లే మహాప్రసాదంగా స్వీకరించి తృప్తి చెందుతూంది సుందరి. ఇలావుండగా ఒకరోజు వచ్చింది. ఆనాడు క్యాంపుపని పూర్తి అయిపోయింది. తిరిగి ఆఫీసుకు హైదరాబాదు వెళ్ళిపోవాలి. ఈవార్త సుందరికి ఎలాగ అందించడమా అని భయపడుతున్నాను. రాత్రి ఏకాంతంగా వున్నప్పుడు ఆమెతో అన్నాను.

"సుందరీ. ఇంక మూడురోజుల్లో నేను వెళ్ళిపోతున్నాను" దెబ్బతిన్న లేడిలాగ త్రుళ్ళిపడింది. ఓరగా చూసి "నేనూ వస్తాను" అంది. ఎన్నడూ కలగని భయమేదో పొడసూపింది నాలో.

"అదెల్లా వీలుపడుతుంది."

"మావాళ్ళేమీ అనరు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. విడిచి వుండలేను" అంది చెమరుస్తున్న కనుకొలకులతో.

"వీలులేదు. నాభార్య వుందని ముందే చెప్పేనుగా" అన్నాను నేను.

"ఉంటేనేం? నేనూ వుంటాను ఆమెకూ మీకూ సేవచేస్తూ. ఇంట్లో దాసీ దానిలాగేనా వుంచుకోండి."

"అసాధ్యం సుందరీ! మన సంగతి ఆమెకు తెలిస్తే కర్ర తీసుకుంటుంది."

"ఫరవాలేదు. మీకు దెబ్బతగలకుండా నే నడ్డువస్తాలెండి" అంది సుందరి, నాకోసం తన దేహాన్ని త్యాగంచేసిన సుందరి.

"క్షమించు. ఎప్పుడైనా రొక్కం పంపిస్తుంటాలే."

"ఏం? నేనేం వేశ్య ననుకున్నారా?" అని నిశితంగా చూసింది సుందరి. ఆ చూపులు నేను భరించలేక పోయేను.

"అదికాదు. లోకం వింతయినది. మన్ని క్షమించదు. నీ వాతావరణం వేరు. నా వాతావరణం వేరు. కనుక ఎవరైనా ఇక్కడే పెళ్ళి చేసుకు సుఖపడు" అన్నాను నన్ను నేనే మోసగించుకుంటూ.

"చాల్లెండి, ధర్మపన్నాలు. నే వచ్చి తీరుతాను. నన్ను మీరు లొంగతీసుకున్నారు" నాకెందుకో భయం కలిగింది.

"సరే వెళ్లు, తర్వాత చూసుకుందాం ఆ సంగతి" అన్నాను ఆమె భుజంమీద చెయ్యి వేస్తూ. నా చెయ్యి ప్రక్కకు నెట్టివేస్తూ,

"చెప్పండి-తీసుకు వెడతారా, వెళ్ళరా? నేను మిమ్మల్ని విడచి వుండలేను. ఏ బండ మీదనుంచో దూకి చస్తానుగాని" అంది సుందరి స్వాభిమానంతో.

"రేపు చెబుతాలే. ఆలోచించనీ" అంటూ తలుపు తెరచేను. ఆమె వెడుతూ వెడుతూ ఆ చీకటి వెలుగులో ఓసారి వెను దిరిగి చూసి వెళ్ళిపోయింది.

నాకు నిద్ర రావడంలేదు. సుందరి నిజంగా నన్ను ప్రేమించిందా? లేక కపటనటనా? నా డబ్బుకోసం ప్రేమించే నంటూందా? మరి ఆ కళ్ళలో నీళ్లెందుకు తెచ్చుకుంటుంది? నిజానికి నాతిత్వం సుందరితత్వం ఒకటేనా? ఆమె నా డబ్బుచూసి నన్ను ప్రేమిస్తోంది, నేను ప్రభావతి డబ్బుచూసి ఆమెను ప్రేమించినట్లు. వీటికేంగాని నిజంగా పట్టుపట్టి సుందరి నాతోవస్తే ఇంకేమైనా వుందా? ఆఫీసులో నలుగురిలో తలయెత్తుకో గలనా? ప్రభావతి ఏంచేస్తుంది? ఏవేవో భయానక దృశ్యాలు గోచరించేయి. వెంటనే నా మనుష్యులను లేపేను. ఉన్నదున్నట్లు చెప్పి తలో పదిచేతిలో పెట్టేను. సామాను ఆరాత్రి రెండు గంటలకు పదిమైళ్లలోవున్న పట్టణానికి మోసేసేను. సకారామ్ కూడా మాకు సహాయం చేసేడు. ఇంతకీ ఎవరిని మోహించి, చూడాలని తహతహలాడేనో ఆసుందరి నీడకి భయపడి అర్థరాత్రి వేళ దొంగతనంగా ఆ చోటునుంచి దాటిపోయేను.

* * *

ఎనిమిది సంవత్సరాలు గడిచేయి. ఎలా గడిచేయో వివరించడం చాలా కష్టం. సుందరి బాయిని విడిచి హైదరాబాదు వచ్చిననాటి నుంచీ నాలో భయం, పశ్చాత్తాపం పొడచూపేయి. క్రొత్తలో ఏమూలనుంచో సుందరి వస్తున్నట్లే వుండేది. "నేవచ్చితీరుతాను.మీరు నన్ను లొంగతీసుకున్నారు" అన్న సుందరి మాటలు పదేపదే తలుచుకుని కృంగిపోయేవాడిని. ఆమెను మోసగించి, నన్ను మోసగించుకుని "ఎవరినేనా పెళ్ళిచేసుకు సుఖపడు" అని నేనిచ్చిన సలహాకి నాకే సిగ్గు కలిగేది. ఎంత దొంగను నేను? ఏది ఏమైతేనేం పాపం, సుందరి నన్ను బాధించలేదు. నన్ను నిలదీసి నా వంశగౌరవాన్ని కళంకపరచలేదు. లోక ముచ్చరించే మా అనుకూల దాంపత్యానికి అడ్డుగా నిలబడలేదు. ఎనిమిదేళ్ళు గడిచేయి. పాపం, ఎక్కడ, ఏంచేస్తోందో నా సుందరి? నాకూ ప్రమోషన్ వచ్చింది. ప్రభావతి ఆఫీసరు గారి భార్యగా మారింది. కొ[illegible]న్నాం. ఆభిజాత్యం మా సంసారాన్ని ఆవేశించింది. నా మనస్సు మాత్రమింకా సుందరికోసం ఆక్రోశిస్తూనేవుంది.

మళ్ళీ అదే చిప్లూన్ అరణ్యప్రాంతాలకి క్యాంపుకు పోతున్నాను. ఇప్పుడు నాకు పులులంటే భయంలేదు. నెంబరు 303 తుపాకీతో, ఆఫీసరుగా కారులో, భార్యాబిడ్డలతో క్యాంపుకు వెడుతున్నాను. అదే బంగాళా "ఎనిమిదేళ్ల క్రితం ఇక్కడేం చేసేవో జ్ఞాపకముందా?" అంది. నేను చలించలేను. ఇప్పుడు నేనుఆఫీసరును. నన్నెవరూ గుర్తుపట్టలేరు.ఎనిమిదేళ్ళలో ఆ ప్రదేశ మెంతగా మారిపోయింది? ఆ పాడుపడ్డయిళ్లు అదృశ్య మయిపోయేయి. సకారామ్ స్వర్గం చేరుకున్నాడు.అతని కొడుకు భానూ యిప్పుడు చౌకీ దారుగా వున్నాడు.

ఆ రాత్రి భోజనానంతరం నా భార్య గ్రామఫోను పెడుతూంది. పిల్లలు చుట్టూ కూర్చున్నారు. డ్రైవరు బయట వరండాలో కూర్చుని వింటున్నాడు. భానూతో కలిసి కొంచెం దూరంగా పొదు కొంపలుండిన స్థలం వైపు వెళ్ళేను నేను. ఇంకా దూరంగా పోదామంటే భానూ అన్నాడు "వద్దు బాబూ, యీ ప్రాంతంలో పులులు తిరుగుతుంటాయి" అని. "నువ్వెప్పుడేనా పులిని చూసేవా" అన్నాను.

"చూడలేదుగాని దాని అరుపు విన్నాను. అదుగో చూడండి ఎనిమిదేళ్ళ క్రితం ఇక్కడొక ఆడమనిషిని తరిమింది పులి" అన్నాడు. నా మనస్సు అకస్మాత్తుగా సుందరి మీదకు పోయింది.

"ఆ మనిషి పేరు?"

"సుందరీబాయి"-"హా" అన్నాను నిస్పృహతో—

"పులి తరుముతే ఆ మనిషి బండమీదనుంచి పడిపోయింది-ఆ శబ్దం విని మా నాన్నవాళ్లు పరుగెత్తేరు. అప్పటికే ఆవిడ మనలో లేదు. అంత పెద్ద బండమీదనుంచి జారుతే ఇంకా బ్రతుకుతుందా చెప్పండి?" అన్నాడు భానూ. దీనంగా 'సుందరీ' అని అక్కడే కూలబడ్డాను నేను. నాకేమీ తోచలేదు. సుందరి నాతో ఆడిన కడసారి మాటలు,

"చెప్పండి, తీసుకువెడతారా, వెళ్లరా? నేను మిమ్మల్ని విడిచి వుండలేను. ఏ బండమీదనుంచో దూకి చస్తానుగాని" అన్న మాటలు నన్ను శూలాల్లా గ్రుచ్చుకొంటున్నాయి.

"భానూ సరిగా చెప్పూ—సుందరి రాత్రి బయటకి ఎందుకొచ్చింది?"

భానూ ఆరంభించేడు-

"దానికంతా వుందిలెండి. అది కొంచెం పోకిరీ మనిషి ఈ బంగాళాలో ఒక ఆఫీసరు ఉండేవాడు. ఆయనతో అది తిరుగుతుండేది. ఆయన పని పూర్తి చేసుకుని హైదరాబాదు వెళ్ళిపోయేడు. ఆ తర్వాతఅది అన్నతో చెప్పింది:

'నేనూ హైదరాబాదు వెడతాను. ఆయన్ని విడిచి వుండలేను' అని. దాని అన్న ఎంత చెప్పినా వినలేదు. ఆఖరికి మా నాన్నకూడా చెప్పి చూశాడు అబ్బా! వినందే. ఆ మర్నాడే అది ఎవరికీ చెప్పకుండా పారిపోయింది. వెంటనే వెళ్ళి మా నాన్న, దాని అన్నా అది రైలెక్కకుండానే పట్టుకు తీసుకువచ్చేరు. అది ఏడుస్తూనే వచ్చింది. ఇంతకీ దాని మృత్యువు లాక్కొచ్చి వుంటుంది. ఆ రాత్రే అది ఏడుస్తూ బయట కొచ్చిందట కొంచెం సేపటికే మనిషి జారిన శబ్దమైతే అందరూ పరుగెత్తేరు."

"మరి పులితరిమిందన్నావ్" అన్నాను నేను.

"అవును. లేకపోతే ఎందుకు పడుతుంది? ఆపైన దాని అన్నకు 'గాండ్రు' మన్న పులి అరుపుకూడా వినిపించిందట. ఏది ఎలాగైతేనేం పాపం దానిమట్టి ఆ బండకింద వుంది-"

నాకు ఏమనాలో తెలియదు. నిజంగా సుందరిని నన్ను ప్రేమించింది. ఆమె ప్రేమను సవ్యంగా అందుకొనే శక్తిలేని బలహీనుణ్ణి. లోకుల దృష్టిలో నేను గొప్పవాడిని. కాని, నాలో నేను పిరికివాడిని. "ఆ సుందరిని తరిమి చంపినది పులికాదు. నేను" అందామనుకున్నా కాని, నాహోదా నా కంఠానికి అడ్డుతగులుతూంది. అక్కడే కూర్చుని ఆకాశంకేసి చూస్తున్నా. నా సుందరి తారాపథంలోంచి పలుకుతూంది కవయిత్రిలా.

"నేనొక తారనై నిలిచి నింగిని నిచ్చలు నిన్ను చూచుచున్నాను..." ఏడుపు వస్తోంది. జీవితంమీద విరక్తి పుడుతోంది. అయినా జీవించక తప్పదుగదా?"

"అమ్మగారు రమ్మంటున్నారు" అన్నాడు డ్రైవరు. విధిలేక లేచేను. పడకగది తలుపు వేస్తూంటే ప్రభావతి, నా శరీరంమీద సర్వాధికారిణి అడుగుతూంది. "ఎంతపిలిచినా వినరేం? బయట పెద్దపులులు తిరుగుతుంటాయట - ఏమిటాతపస్సు—" గుండె బరువుతో అన్నాను,

"పాపం అవేంచెయ్యవు. మన చుట్టూనూ, మనలోనూ వున్న పెద్దపులులే ప్రమాదకరమైనవి" అని. ఆమాటలోని భావం ప్రభావతికి అర్థమవలేదు. అర్థం చేసుకోవలసిన అవసరం కూడా లేదాయెను.